క్లుప్తంగా

లైబ్రరీకి పుస్తకాల అందజేత

మాక్లూర్: గుత్ప ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సర్పంచ్ గంట చిన్నయ్య స్నాక్స్, లైబ్రరీకి పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపటానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సాయంత్రం సమయంలో స్నాక్స్, చాక్లెట్స్ అందజేసే కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పాఠశాల చైర్మన్ ఒడ్డే రమేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం



రుద్రూర్: మోస్రా మండలం గోవూర్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని బుధవారం స్కూల్ కమిటీ చైర్మన్ నన్నేసాబ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున అల్పాహారం కోసం ఒక్కొక్కరికి రూ.15 చొప్పున ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. హెడ్ మాస్టర్ రవీంద్ర బాబు పాల్గొన్నారు

ప్రమాద బీమా చెక్కు..

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన నాగిడి చిన్న లక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల ప్రమాద బీమా చెక్కును బుధవారం స్థానిక సర్పంచ్ బూసు సునీత చేతుల మీదుగా నామినీ అయిన అనిల్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాహబ్, ఇన్సూరెన్స్ కంపెనీ డీవో ప్రశాంత్ కుమార్, షాహిద్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. మామిడిపల్లి కుస్తూర్బా గాంధీ పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకుసాగాలన్నారు. లక్ష్యం నెరవేరే వరకు పట్టుదలతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కౌన్సిలర్ ఎస్ఆర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ గంగామణి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏఈ సెక్షన్ కార్యాలయంలో గురువారం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డీఈ హరిచంద్‌నాయక్ తెలిపారు. ఆర్మూర్,0 జక్రాన్‌పల్లి, ఆలూర్ మండలాల విద్యుత్ వినియోదారులు బిల్, ఇతర విద్యుత్ సంబంధ సమస్యలు ఉంటే రావాలన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



బాల్కొండ: వరిలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నాగాపూర్‌లో రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల అధికంగా అగ్గి తెగులు, మొగిపురుగు, పాము పొడ తెగులు, ఉల్లికోడు వస్తుందన్నారు. నివారణ కోసం సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరి పంట ఎదుగుదలకు జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాములు కలిపి ఎకరానికి 200 లీటర్ల నీటిని పిచికారీ చేయాలన్నారు. యూరియాను మోతాదుకు మించి వాడవద్దన్నారు. తెగుళ్ల నివారణకు పలు సలహాలు, సూచనలిచ్చారు. ఏఈవో కృష్ణవేణి పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు బీఎల్‌టీయూ కృషి

నవీపేట: బీడీ పరిశ్రమలోని కార్మికుల శ్రేయస్సుకు బీఎల్‌టీయూ విశేషంగా కృషి చేస్తుందని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధి రాములు పేర్కొన్నారు. బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాలెండర్లను ఆయన బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అమలు చేస్తున్న పథకాలతో లబ్ధి చేకూ రేలా యూనియన్‌లు దోహదం చేయాలని ఆకాంక్షించారు. కార్మికుల శ్రేయస్సు కోసం బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టామని గుర్తు చేశారు. నాయకులు సయ్యద్, ప్రకాష్, గంగాధర్, మహమ్మద్, ముక్తార్, శివ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీ ఎప్పుడో.. ?

- భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఖాళీలు
- అధికారులు లేక కుంటుపడుతున్న అభివృద్ధి



భీమ్‌గల్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిస్థితి. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీ ఏర్పాటుకు కృషి చేశారు. అనుకున్నదే తడవుగా మున్సిపాలిటీ అభివృద్ధికి నడుం బిగించారు. కానీ పరిపాలన విభాగంలో కమిషనర్ రెండేళ్లు ఉండి బదిలీపై వెళ్లారు. ఆయనతో పాటు పలు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. కొత్త మున్సిపాలిటీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా అందుకనుగుణంగా పోస్టుల మంజూరు లేకపోవడంతో ప్రస్తుతమున్న సిబ్బంది సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మున్సిపల్‌లోని ఇతర పోస్టులో డిప్యుటేషన్లు లేదంటే ఉన్న వారితోనే సర్దుకుపోతున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసినా క్షేత్రస్థాయిలో నిధుల కేటాయింపు జరగాలి. అలాగే పనుల్లో నాణ్యతపై పర్యవేక్షణ చేయడానికి సిబ్బంది అవసరం తప్పనిసరి. మున్సిపల్ అభివృద్ధికి వెన్నెముకలా ఉండే కమిషనర్, పట్టణ ప్రణాళికాధికారి, ఇంజినీర్లు ఎవరూ కూడా ఇక్కడ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి రాజ్యమేలుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల చేతివాటం ఎక్కువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న బాల్కొండ నియోజకవర్గంలోని ఏకైక మున్సిపాలిటీలో ఉద్యోగులు లేకపోవడం గమనార్హం. మున్సిపల్‌లో కమిషనర్ బదిలీపై వెళ్లడంతో అప్పుడు విధుల్లో ఉన్న తహసీల్దార్ రాజేందర్‌ను ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఈ అధికారి ఎప్పుడు వస్తారో పోతారో తెలియని పరిస్థితి ఉంది.

కావాల్సిన పోస్టులు:
మున్సిపాల్ కమిషనర్ , ఏఈ, డీఈ, సానిటరి ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, టీపీఎస్, టీపీవోలు అవసరం

శాశ్వత కమిషనర్ అవసరం

పనులు వేగంగా జరగాలంటే శాశ్వత మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం కొందరు డిప్యూటేషన్ పైనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న సిబ్బందిపై పని భారం పెరిగి, సేవల్లో నాణ్యతా లోపం ఏర్పడుతోందని, ప్రగతి సాధించాలంటే శాశ్వత ఉద్యోగులను నియమించాలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు

రుద్రూర్: తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి పనిలో కేంద్ర ప్రభుత్వ నిధులున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మోస్రా మండలం గోవూర్‌లో ప్రజా గోస-బీజేపీ భరోసా, శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం, 14, 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారానే తెలంగాణలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందన్నారు. బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ.. అధికార బీఆర్ఎస్ ఆగడాలు మితిమీరుతున్నాయని, బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షులు స్వామిగౌడ్, బాన్సువాడ నియోజకవర్గ కో-కన్వీనర్ భూపాల్ రెడ్డి, గ్రామ శక్తి కేంద్ర ఇన్‌చార్జి శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత ధన్‌పాల్

హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నేత వడ్డీ మోహన్‌రెడ్డి

నవీపేట: హామీలను అమలు చేయడంలో ఎమ్మెల్యే షకీల్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి ఆరోపించారు. జన్నెపల్లిలో బుధవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జన్నెపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల నుంచి కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. జన్నెపల్లిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించి పక్కనే ఉన్న బినోలతో చిచ్చు పెట్టారని ఎద్దేవా చేశారు. అక్రమాస్తులను కూడబెట్టిన ఎమ్మెల్యే చిట్టాను బయటపెడతానని పేర్కొన్నారు. పదవీ వ్యామోహంతో పార్టీ మారి నట్లు ఆరోపించిన ఎమ్మెల్యే తన గత చరిత్రను గుర్తు చేసుకోవాలని సూచించారు. నాపై నమ్మకంతో జాతీయ స్థాయిలో పదవులు అప్పగించారని, రాజకీయాల్లో షకీల్ తనకంటే జూనియరేనని ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకే పరిమితమైన బీఆర్ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు గట్టిగా గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం



బోధన్‌టౌన్(బోధన్): శివసేన పార్టీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ఇటీవల ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహంతో పాటు స్వామి వివేకానంద, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసులోటి గోపికిషన్ మాట్లాడారు. కందకుర్తిలోని త్రివేణి సంగమం గంగాజలంతో విగ్రహాలను కడిగి పాలాభిషేకం చేసి పూల మాలలు వేసినట్లు తెలిపారు. నాయకులు లోకేష్, ప్రీతమ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



వేల్పూర్: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం ముప్కాల్ మండల బీఎస్పీ నాయకులు 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

ఆయిల్‌పాం మొక్కలు నాటిన నేతలు

వేల్పూర్: సాహెబ్‌పేట్ సమీపంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. నాయకులు రాకేశ్‌చంద్ర, బీమ రాజేందర్, రేగుల్లరాములు, సాహెబ్‌పేట్ సర్పంచ్ సుధాకర్‌గౌడ్, ఏడీఏ మల్లయ్య, ఉద్యానశాఖ అధికారులు రోహిత్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా'పై ప్రజాప్రతినిధులు స్పందించాలి



బోధన్ : దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: చారిత్రక ప్రస్థానం కలిగిన బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టి రెండు నెలలు కావస్తోందని, ప్రజాప్రతినిధులు స్పందించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి 59వ రోజుకు చేరాయి. దీక్షలో హైకోర్టు న్యాయవాది వీరభద్రరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్‌లు కూర్చున్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బాల్కొండ: మెండోరా మండలంలో పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు బుధవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. సోన్‌పేట్‌లో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రూ.14 లక్షలతో హనుమాన్ ఆలయం ఆర్చి గేటు, దూదిగాంలో రూ.20 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.5 లక్షలతో రెడ్డి కమ్యూనిటీ హాల్, నెహ్రూ నగర్‌లో రూ.20 లక్షలతో జీపీ నూతన భవనం, సావెల్‌లో రూ.20 లక్షలతో హెల్త్ సెంటర్, వెల్కటూర్‌లో రూ.20 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.20 లక్షలతో జీపీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ సరస్వతి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శనగను కొనుగోలు చేయండి

బోధన్: యాసంగి సీజన్‌లో రైతులు పండించిన శనగ పంటను పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని, క్వింటాలుకు మద్దతు ధర రూ.6,500 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్ డిమాండ్ చేశారు. బుధవారం సాలూర మండలంలోని సాలంపాడ్‌లో సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. శనగ దిగుబడులు రైతుల చేతికి వచ్చి పది రోజులు కావస్తోందని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు చేసిన శనగ పంట డబ్బులు వారం రోజుల్లో ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు సుద్దులం తండాకు స్పీకర్

రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులం తండాలో గురువారం నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ తెలిపారు. అనంతరం గ్రామంలోని అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు.



మహాశివరాత్రికి ఏర్పాట్లు

- నేటి నుంచి శివాలయంలో ఉత్సవాలు

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లిలో వెలసిన రాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఆలయం చిన్నగా ఉండేది. గ్రామస్తులంతా కలిసి నూతన మందిరాన్ని నిర్మించారు. ఆలయం ముందర ఏర్పాటు చేసిన గార్డెన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పది సంవత్సరాల క్రితం గార్డెన్ ఏర్పాటుకు గ్రామస్తులు బీజం వేశారు. ఇప్పుడు బృందావనంను తలపించేలా పచ్చని రంగును సంతరించుకుంది. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం ఆలయానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. కొత్తపల్లి శివాలయం సమీపంలో గణపతి, నాగేంద్ర, నవగ్రహ ఆలయాలు, దర్గా కూడా ఉన్నాయి. మత సామరస్యానికి ప్రతీకగా ఆలయం వద్ద దర్గా నిర్మాణం చేపట్టారు. భక్తులు ప్రతి సోమ, శని వారాల్లో అధికంగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద ప్రతి సోమవారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తారు.

శివ దీక్షలు..

ఆలయం వద్ద శివరాత్రికి 41 రోజుల ముందు నుంచే సందడి మొదలవుతుంది. గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల నుంచి వచ్చి భక్తులు శివ దీక్షలు చేపడతారు. ప్రతి సంవత్సరం శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. ప్రస్తుతం శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు.

ఘనంగా నిర్వహిస్తాం

కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి చెందిన శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. అందుకు తగిన ఏర్పాట్లను ప్రారంభించాం. మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తాం.

– శ్రావణ్ శర్మ, ఆలయ అర్చకుడు, కొత్తపల్లి

కార్మికుల కోసం పోరాడిన మహనీయుడు ధర్మభిక్షం



కోటగిరిలో ధర్మభిక్షానికి నివాళులర్పిస్తున్న గీతకార్మికులు

రుద్రూర్: గీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు కామ్రేడ్ ధర్మభిక్షం అని తెలంగాణ గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ధర్మ భిక్షం 101వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విఠల్ గౌడ్ మాట్లాడుతూ..గీత సహకార సంఘాల ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. గీసే వారికి చెట్టు నినాదంతో గీత కార్మికులను ఉద్యమ బాటలో నడిపించారని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, సహాయ కార్యదర్శి పండరి గౌడ్, ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, గంగా గౌడ్ పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

- శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. బుధవారం వర్ని మండలంలోని సేవాలాల్ తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిర 8వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ ఆశయాలు, మార్గాలను గిరిజనులందరూ పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం జరిగిందని చెప్పారు. వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్, మండల ఉపాధ్యక్షులు బాలరాజు, పోచారం భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి



ఆర్మూర్‌లో పూజలు చేస్తున్న ఎంపీ అర్వింద్



బిలియా నాయక్ తండాలో..

ఆర్మూర్: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్క గిరిజన బిడ్డ కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని ఆయన నివాసంలో భారతీయ జనతా గిరిజన మోర్చా (బీజేజీఎం) ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని బుధవారం నిర్వహించారు. బీజేజీఎం ఆర్మూర్ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు గూగులోత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ అర్వింద్ ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు.

కమ్మర్‌పల్లి పరిధిలో..

కమ్మర్‌పల్లి/మోర్తాడ్: హాసాకొత్తూర్ పరిధిలోని మారుతి నగర్, అమీర్‌నగర్ పరిధిలోని బిలియానాయక్ తండాలో సేవాలాల్ జయంతి నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భోగ్ భండార్(నైవేద్యం) సమర్పించారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని శ్రీ నారాయణ తండాలో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

పెంటాకుర్దులో బంజారాలకు సన్మానం

బోధన్ రూరల్ (బోధన్): సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని పురస్కరించుకుని బుధవారం పెంటాకుర్దు గ్రామ పెద్దలు ,చిట్టెపు కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివసాయి పటేల్, పెంటాకుర్దు క్యాంప్ గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బంజారా కులస్తులను ఘనంగా సన్మానించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు.

ఎడపల్లి/రుద్రూర్/మాక్లూర్: ఎడపల్లి, మాక్లూర్, రుద్రూర్ మండలాల పరిధిలోని పలు తండాల్లో సంత్ సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, యజ్ఞం చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆడి పాడారు.



బంజారాలతో సర్పంచ్ శ్రీనివాస్‌రావు



ఓడ్డేపల్లిలో నృత్యాలు చేస్తున్న గిరిజనులు



మాక్లూర్: కల్లెడిలో..

సమాచారం ఇవ్వడం లేదు

- నవీపేట సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- అధికారుల నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

నవీపేట: గ్రామాలలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మన ఊరు-మన బడి కార్యక్రమంపై ఎంఈవో గణేష్ రావ్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ఆయనను నిలదీశారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు గ్రామంలో చేపడుతున్న పనులపై కనీస సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నవీపేట-2, 3 ఎంపీటీసీలు సతీష్‌లు పీఆర్, ఇరిగేషన్, ఉపాధి హామీ అధికారుల తీరును దుయ్యబట్టారు. జన్నెపల్లి గ్రామంలోని మాటు కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించలేదని, రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీటీసీ బట్టురాణి ఇరిగేషన్ ఏఈని నిలదీశారు. ఈ విషయమై రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఆధార్‌సెంటర్లలో ఇష్టానుసారం డబ్బులు వసూలు చేస్తున్నారని, మండల కేంద్రంలో నాసిరకంగా సీసీ రోడ్డు నిర్మించడంతో కంకర తేలిందని కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ అధికారులను నిలదీశారు. జెడ్పీటీసీ నీరడి సవిత, వైస్ ఎంపీపీ హరీష్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం అందజేస్తున్న స్త్రీ నిధి రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మహిళా సంఘ భవనంలో బుధవారం మహిళ సంఘాల సభ్యులకు, ఆర్పీలకు సౌరవిద్యుత్ యూనిట్స్‌పై స్త్రీనిధి ద్వారా అందజేస్తున్న రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సౌరవిద్యుత్ యూనిట్స్‌పై 40 శాతం సబ్సిడీతో కూడిన స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2 కేవీ యూనిట్‌కు రూ. లక్ష, 3కేవీ యూనిట్‌కు రూ.లక్షా 25వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నా రు. ఈ రుణాలు ప్రతి నెలా ఈఎంఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పండిత్ వినీత